# 'రంగుల గదిలో సుశీల'

ఆమెను నలభై ఏళ్లక్రితం చూశాను.

'టౌన్‌హాలులో నాటకం ఆడ్తున్నారంటరా' అని సీతాపతిగాడు రహస్యం చెప్పాడు. వెళ్దామంటే వెళ్దామనుకున్నాం.

టౌన్హాలు మా క్యాంపుకు బాగా దూరం.

'మోహన్‌గాడు కూడా వస్తానన్నాడ్రా వాడి సైకిల్లో త్రిబుల్ రైడింగ్ వెళ్దాం' సీతగాడే అయిడియా యిచ్చాడు.

ఆకలేస్తుందని ఏడింటికే అన్నాలు తిని 'అమ్మద్సా' (అహమ్మద్ సారు) యింట్లో చదువుకొనొస్తామని యింట్లో అబద్దాలు చెప్పి బైటపడ్డాం.

నాటకానికి వక రూపాయి టికెట్టన్నారు. యీడ్చిపెట్టి కొట్టినా ముగ్గురి దగ్గరా ముప్పావలా కూడా లేదు... లాగూల్లో ఉన్న ముగ్గురం, మూడు ద్వారాల్లోంచీ దొంగతనంగా హాల్లోకి దూరిపోయాం. ఏదో సాంఘిక నాటకమే పేరు గుర్తులేదు. మొహాలకి రంగు లేసుకుని, మనిళ్లల్లోలాగా కాకుండా వింతగా మాట్లాడ్తో స్టేజీమీద నటులు ఆసక్తి కలిగించ సాగారు. సీతగాడూ మోహన్గాడూ నేనూ ముగ్గురం మూడు మూలల్లో ఉన్నాం. నేను బాగా వెనకాల ఉండిపోయా, స్టేజీమీద వాళ్ల మాటలు గట్టిగానే వినబడ్తోన్నా, ముఖాలు సరిగ్గా కనిపించక, చిన్నచిన్నగా దారి చేసుకుంటూ ముందుకు చేరుకున్నా.

అప్పుడక్కడ నన్నాకర్షించింది స్టేజీ కానీ దానిమీది నలుగురు కానీ కాదు. వాళ్లు ప్రత్యక్షమయ్యే, మాయమయ్యే పక్కతెరల చాటున ఉన్న గదులు... అక్కడేం చేస్తారు వీళ్లు? చూడాలనిపించింది. దొంగలాగా నక్కినక్కి బైటికి చేరి స్టేజీ కుడిపక్కన ఉన్న గది దగ్గరికి చేరాను. తలుపులు చేరవేసి ఉన్నాయి. నెమ్మదిగా తలుపులు తోసి సందులోంచీ చూసా...

అదే ఆమెను మొదటిసారి చూట్టం...

రేకు మడత కుర్చీలో చేరగిలి సిగరెట్టు కాలుస్తోంది... సిగరెట్టు కాల్చే ఆడవాళ్లని ప్రత్యక్షంగా చూట్టం అదే ప్రథమం.

'రేయ్ ఎవడ్రా నువ్వు నడు బాంచెత్' అన్న అరుపుకి నేనూ ఆమె యిద్దరం ఒకేసారి ఉలిక్కిపడ్డాం...

'ఉత్తినే చూస్తున్నానండీ' భయంగా అన్నా...

'నడూ' అని ఆ నిలువెత్తు భీకర రూపం తర్జని చూపించి రంకె వేసింది.

'ఉండు మీ తిరిప్తీ... అరే అబ్బుడూ యిట్టా రారా' ఆమె పిల్చింది. భయంభయంగానే ఆమె దగ్గరి కెళ్లా...

'ఆట కొచ్చినాఁ?' యాసతో అడిగింది.

ఔనన్నట్టు తలూపా...

'పేరేమియా?' అదే యాసతో అడిగింది. ఆమె దగ్గర ఏదో వాసన... అది సారా వాసనని యిప్పుడు బాగా తెలుసు... ఇంతలో ఆ భీకర రూపం మళ్లీ వచ్చి 'పద నీ ఎంట్రీ' అంది.

ఆమె నా తల తడిమి లేచి వెళ్లిపోయింది. అక్కడే స్థాణువుగా నిలబడిపోయిన నాకు ఆమె గొంతు స్టేజీ మీంచీ వినిపించింది. మామూలుగా ఆమె మాట్లాడిన యాస స్టేజీ భాషలో అస్సలు లేకుండా మాయమయ్యింది.

తర్వాత అడపాదడపా ఆమె అక్కడక్కడా కనిపించేది... ఎక్కడినించో వచ్చి మా వూళ్లో స్థిరపడిపోయింది.

నేను హైస్కూలు దాటి వచ్చే సమయానికి ఆమె నాకు బాగా తెలిసిన వ్యక్తిని ఆశ్రయించి, అతనితోటే ఉండేది. అప్పుడామెకు ఓ మూడు నాల్గు సంవత్సరాల కొడుకుండేవాడు.

నేను డిగ్రీకొచ్చిన సమయానికి ఆమెకు ఆశ్రయమిచ్చిన వ్యక్తి రోజూ ఆమెతో గొడవపడుతుండేవాడు. బాగా తాగొచ్చి ఆమెను జుత్తు పట్టి బైటికి వీధిలోకి యీడ్చి కాలా చేతా తన్నేవాడు... చుట్టుపక్కల జనాల మాటలు ఈ రోజుకీ నా చెవుల్లో మారుమోగు తున్నాయి.

'కావాల్సిందే లం... కు సంసారాలు నాశనం చేస్తారిట్లాంటివాళ్లు' దాదాపు అందరూ అదే అభిప్రాయం వ్యక్తం చేసేవాళ్లు...నాలో యువరక్తం ఉడుకెత్తిపోయేది. అయినా చేసేది ఏమీలేక అక్కడ్నించి నిష్క్రమించేవాణ్ణి.

* * *

కొన్ని రోజులకు ఆమెకాశ్రయమిచ్చిన వ్యక్తి ఆమె దగ్గరకి రావడం మానేసాడు. ఆమె మూడు గదులు ఇంటినించీ ఒక్క గది ఇంటికి మారింది. కొడుక్కు చదువు అబ్బలేదు. ఒకరిద్దరు ఆమె దగ్గరికొచ్చి వెళ్లేవాళ్లు... ఎందుకు ప్రత్యేకంగా. నేను చెప్పనవసరం లేదు. మళ్లీ కొద్దిరోజులకు ఆమె మకాం ఆ ఒంటిగది ఇంటినించీ యిప్పుడు కొత్త బస్టాండ్ ఉన్న

ప్రాంతంలోని ఓ గుడిసెకు మారింది. కొడుకు పెటీ థీఫ్‌గా పోలీస్ రికార్డుకెక్కాడు. కొన్నాళ్లకు వాడూ మాయమయ్యాడు. చివరిసారిగా ఆమెను చూసింది ఆమె వంగిపోయి చిరుగులుపడ్డ దుస్తులతో దగ్గుతూ హాస్పిటల్‌లోకి వెళ్లడం... అదే అంతే ఆఖరు...

ఆమె అసలు పేరేదైనా...

రంగస్థలం మీద రకరకాల పేర్లతో పిలవబడినా... నిజ జీవితంలో ఆమెకు మిగిలిన పేరు పిలువబడిన పేరూ, రెండక్షరాల తిట్టు మాత్రమే. ఆమెకేనాడూ నేను చిల్లిగవ్వ సాయం చేయలేదు. చేయలేని స్థితిలోంచీ చేయగలిగిన స్థితికి వచ్చినా కూడా... ఆమె యీ రోజుకీ నన్ను 'ఛాయగా వెంటాడ్తోంది. నిజ జీవితంలో ఆమెకు ఏమీ చేయలేక, నా నవల 'రంగులగది'లో ఆమెను 'సుశీల'ను చేసి ఆ పాత్రకో సుఖవంతమైన మలుపునిచ్చి ఓ అబద్ధపు తృప్తిని పొందాను.

* * *

***కళ కళ కోసమూ, ప్రజల కోసమూ అని చాలామంది దబాయిస్తుంటారు...నన్నడిగితే కళ కళాకారుల కోసమేనంటాను... కళ తప్పినవాళ్ల నిజ దిగంబర జీవితాలకు 'కళ' అవసరమంటాను.*** ●